కథా నిలయం
శ్రీకాకుళం

# సితారా

చింతల అనసూయ


**"హుజూర్! ఢిల్లీ చక్రవర్తుల వారు తమ భటుల చేత తమకోసం కానుకలను పంపారు. అందులో యాభైమంది సుందరాంగులు కూడా వున్నారు" అంటూ వంగి సలాములు చేశాడు ద్వారపాలకుడు.**

"సుందరాంగులను ప్రవేశపెట్టండి!" నాదిర్‌షా కంచుకంఠం ఆ గుడారంలో ప్రతి ధ్వనించింది. ఆ ధ్వనిని బయట నిల్చున్న యువతులు కూడా విని వులిక్కిపడ్డారు. మొగలాయి సుందరీమణులు చాలా అందంగా వుంటారని నాదిర్‌షా విన్నాడు. క్షణాల్లో ఆ మగువలంతా నాదిర్‌షా ముందు వరుస క్రమంలో నిల్చున్నారు.

ఆకాశం చివరి అంచున సూర్యుని అగ్ని గోళం కిందికి జారుకుంటోంది.

అది సంధ్యాసమయం...

ప్రత్యేక సదుపాయాలున్న గుడారంలో నాదిర్‌షా విశ్రాంతి తీసుకుంటున్నాడు. నోటిలో హుక్కా వుంది. అందులోంచి వస్తున్న పొగ సువాసనల్ని వెదజల్లుతోంది. వజ్రకఠోరమైన అతని హృదయాన్ని కరుణ ఆవరించాలని చూస్తోంది. పౌరుషము, ఠీవి, తేజస్సు, ఆత్మ విశ్వాసము, కాఠిన్యత కలగలిపిన భావం అతని ముఖాన్ని ఆవరించి వుంది.



వరుస క్రమంలో నిల్చున్న మొగల్ మగువల్ని నాదిర్ పరీక్షగా చూస్తూ వుండగా తన దృష్టి ఓ పుత్తడిబొమ్మ మీద పడింది. అతిలోక సుందరిలా అగుపించింది. ఆమెను తప్ప మిగతావారినందరినీ పక్క గుడారానికి పంపించి, వారికి ప్రత్యేక సదుపాయాలను కల్పించమని భటులను ఆదేశించాడు నాదిర్.

నాదిర్ ఆ జవ్వని దగ్గరకు వచ్చి-

"ఎవరు నీవు?" సౌమ్యంగానే అడిగాడు.

"రాజపుత్ర జాతికి చెందిన ముస్లిమ్ కన్యను" మాటలు కఠోరంగా వున్నాయి.

"నీ పేరు?"

"నన్ను సితారా అంటారు" తీక్షణంగా నాదిర్‌షాని చూస్తూ అంది సితారా.

"నీ ఎడమ చేతి వేలును అలంకరించిన ఉంగరము చూడముచ్చటగా వున్నది. ఏదీ? చూడనివ్వు.." అంటూ నాదిర్‌షా సితారా చెయ్యిని తన చేతిలోకి తీసుకోబోయాడు.

"ఖబర్‌దార్! నన్ను ముట్టుకోవద్దు. నాకు వివాహమైంది" అంటూ నాదిర్‌షాను హెచ్చరిక చేసింది సితారా. ఆడసింహంలా గర్జించింది. ఆవిడ దుస్సాహసాన్ని చూసి ద్వారపాలకుడు కరవాలాన్ని బయటికి తీశాడు. ముందే తన దగ్గరున్న కత్తిని పైకెత్తి ఆ సిపాయివైపు ఉరిమి చూసింది సితారా.

ఆమె పౌరుషం నాదిర్‌షాను అమితంగా ఆకర్షించింది. ఇద్దరినీ వారిస్తూ "ఆ కత్తి ఇలా యివ్వు" సౌమ్యంగా అడిగాడు. ఆవిడ చలించ లేదు. కత్తినివ్వలేదు.


"ఆ కత్తినిస్తావా లేదా?" సితారావైపు తీక్షణంగా చూస్తూ సింహంలా గర్జించాడు నాదిర్‌షా. విసురుగా చూస్తూ సితారా ఆ కత్తిని నాదిర్‌షాకిచ్చేసింది.

"ఇసే లే జావ్" అని ఆజ్ఞాపించాడు. ద్వారపాలకుడు సితారాను కూడా పక్క గుడారంలోకి తీసుకెళ్ళాడు.

చీకటి పడింది...

దివిటీలు బయట, దీపాలు గుడారాల్లో వెలుగుతున్నాయి.

నాదిర్‌షా ఆలోచనలో పడ్డాడు. అంత అందం, పౌరుషమున్న మగువను ఇంతవరకూ చూడలేదు. తన పేరు వింటే చాలు, జడపదార్థాలు సైతం కంపిస్తాయి.



చక్రవర్తుల సింహాసనాలు వంగి సలాములు చేస్తాయి. శత్రువులు వణికిపోతారు. అటువంటి తనను బానిసగా వచ్చిన ఒక సామాన్యురాలు ఎదిరించడమా? ఆవిడ ముఖంలో ఏమిటా తేజస్సు! ఆత్మవిశ్వాసం, గర్వం, ఆకర్షణ, అందం మిళితమైన ఆ తీక్షణ చూపు ముందు తనెందుకు తల వంచాడు? పాషాణంలాంటి

నా వ్యక్తిత్వం మొదటిసారిగా ఒక మగువ ముందు చలించటం అసామాన్యం.




అర్ధరాత్రయినా సితారాకు నిద్ర పట్టలేదు. మరోవైపు నాదిర్‌షా కూడా మేల్కొనే వున్నాడు.

అర్ధరాత్రివేళ సితారాను తన గుడారంలోకి పిలిపించాడు నాదిర్‌షా. విధిని ఎదిరించి తీరతానన్నంత ధీమాతో కదిలి గుడారంలో కెళ్ళింది సితారా.

"అలా కూర్చో" తన ఎదురుగా వున్న దీవాన్ వైపు చూపిస్తూ అన్నాడు నాదిర్‌షా.

"ఏమిటి నీ ఉద్దేశ్యం?" అన్నట్టు చూసింది సితారా.

"భయపడకు! నేను నిన్నేమీ చేయను. నా గురించి నీవు ఏమి విన్నావో తెలియదు. ఆడపడుచులపట్ల అమర్యాదగా నాదిర్‌షా ప్రవర్తించాడని మాత్రం నీవు విని వుండవు. ధైర్యంతో సాహసించే ఆడవారంటే నాకెంతో అభిమానం. నీ సాహసం, దురుసుతనం, ఆత్మవిశ్వాసం నాకెంతో నచ్చాయి. ఎందుకో నీ గతాన్ని తెలుసు కోవాలనిపించింది. అందుకే పిలిపించాను. నా సహాయం నీకు కావాలనిపిస్తే చెప్పు. నాదిర్‌షా ఇచ్చిన మాట తప్పడు" రెప్పార్పకుండా సితారాను చూశాడు నాదిర్‌షా.

సితారా విశాలమైన నయనాలు నెమ్మదిగా పైకి లేచాయి. నల్లని కనుపాపల చుట్టూ నులివెచ్చని ఓ చిన్న నయాగారా జలపాతం కనురెప్పల కాటుకను తడుపుకుంటూ చెక్కిళ్ళ మీదకు జారింది. నాదిర్ గురించి తను ఎంతో విన్నది. ఇప్పుడతన్ని కనులారా చూశాక, నాదిర్‌షా అంత క్రూరుడు కాదనిపించింది. తనకు మరణ దండన తప్పదనుకుంది. కొన్ని గంటలముందు తను చావటానికి సిద్ధపడే వచ్చింది. కానీ నాదిర్‌షా ఆంతర్యాన్ని చూశాక సితారా ఎందుకో చావును వాయిదా వేసుకుంది.

అణువణువునా మొగతనం, ఠీవి, దర్పం వుట్టిపడే నాదిర్‌షాను చూడగానే తను కొంత చలించిన మాట వాస్తవమే. ఇలా జరగటం ఇదే మొదటిసారని అనుకుంది. తన వ్యక్తిత్వాన్ని కాదంటూ ఎదురు తిరిగిన మనస్సు, అనుకోకుండా నాదిర్ ముందు ఎందుకలా కరిగిందో సితారాకర్థం కాలేదు. తర్వాత, సితార తన కమ్మని కంఠంతో, మత్తెక్కించే పలుకులతో తన గతాన్నంతా నాదిర్‌షాకు చెప్పుకుంది.

తను రాజపుత్ర జాతికి చెందిన యువతినని, బాల్యంలోనే కొందరు దొంగలు తనను బలవంతంగా తీసుకెళ్ళి ఒక మొగల్ సైనికునికిచ్చి వివాహం జరిపించారని, కానీ వాడు చాలా దుర్మార్గుడు కావటంవల్ల మార్వాడీల సహాయంతో తను ఢిల్లీ చేరుకుని, రాణీమహలులో ఒక పనిమనిషిగా మెలగుతూ ఎలా కాలం గడిపిందో, సితారా సవివరంగా నాదిర్‌షాకు తెలియపరిచింది.

నాదిర్ తన్మయత్వంగా విన్నాడు. స్త్రీని తనకు యిష్టం లేకుండా బలాత్కరించినందువల్ల కలిగే క్షణిక పాశవికానందం, అదే మగువ మనసారా ప్రేమించి తన సర్వస్వం అర్పించినప్పుడు కలిగే ఆత్మానందం మధ్య ఎంత తేడా వుందో సితారాను చూస్తూ నాదిర్ బేరీజు వేసుకోసాగాడు. కల్లా కపటం లేకుండా సితారా తన హృదయాన్ని విప్పిన తీరు నాదిర్‌షాను కదిలించి వేసింది. సితారా వెళ్ళబుచ్చిన కర్కశత్వం వెనుక ఎన్ని ఆటుపోటులున్నాయో కదా! అని అనుకున్నాడు నాదిర్‌షా.

కొన్ని క్షణాలు కళ్ళు మూసుకున్న నాదిర్‌షా ఒక నిర్ణయానికొచ్చాడు. తన నిర్ణయాన్ని సితారాకిలా విప్పి చెప్పాడు –

"చూడు సితారా! ఇంతవరకూ నా జీవితం రక్తపాతాల మధ్య, క్రౌర్యం, కర్కశాల మధ్య నలిగిపోయింది. నేను వీటన్నిటితో విసుగెత్తిపోయాను. మహాసామ్రాజ్యాల కంటే మగువ చవి చూపించే మమతానురాగాలు చాలా గొప్పవన్న నిజం, నేను ఆలస్యంగా అర్థం చేసుకున్నాను. అమాయకపు ప్రేమ అల్లాతో సమానమని ఇప్పుడనిపిస్తోంది. మానసిక అశాంతితో అలమటించిపోతున్నాను. నేనెంతటి మహావీరుడనైనా నీలాంటి సాహసం గల పడతి చేయూత నాక్కావాలి. నీకభ్యంతరం లేకపోతే, నిన్ను నా రాణిగా ఏలుకుంటాను. అదీ, నీకిష్టమైతేనే! బలవంతం లేదు. ఏమంటావు సితారా?"

ఇది విన్న సితారా తృళ్ళిపడినట్టయింది. ఆవిడ ముఖం ఆనందంతో విప్పారింది. కళ్ళు తారల్లా మెరిసిపోయాయి. విస్తుపోయి చూసింది సితారా. ప్రపంచ ప్రసిద్ధికెక్కిన నాదిర్‌షా ఎక్కడ, తనలాంటి ఒక మామూలు మగువ ఎక్కడ? ఓ చక్రవర్తి బానిసను వివాహమాడటమా? నమ్మశక్యం కాకుండా వుంది. కానీ అతని మాటల్లో కపటం లేదు. ఇంత ఆనందాన్ని మోసేదెలా? ఈ హృదయం పగిలిపోతుందేమో ననిపిస్తోంది.

మనసంతా గజిబిజిగా వున్నా, ఒక చిన్న మాటైనా బయటికి పెగలి

రాలేదు. మూగ బోయిన సితారా మనసు కంటి తడితోనైనా నీ కృతజ్ఞతలు ఎదుటి వ్యక్తికి తెలుపుకోమంది. మహారాజుల మనసులు ఇంత మామూలుగా వుంటాయా అనిపించింది సితారాకు.

"నేను కాదంటే ఏం చేస్తారు?" కొంటెగా చూస్తూ అంది సితారా.

"నీ అభిమతాన్ని గౌరవిస్తాను సితారా. కానీ ఒకటి మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. స్త్రీ మమత ముందు కరిగిపోవటం నాకు మొదటిసారి అయినా, చివరిదైనా ఇదే అవుతుంది. నీవు కాదన్న తర్వాత నా భవితవ్యం ఎలా ఉంటుందో చెప్పలేను. కానీ నీ చివరి కోర్కెను తీర్చగలిగే శక్తి ఈ నాదిర్‌షాకు ఇంకా మిగిలి వుంది" అన్నాడు నాదిర్.


సితారా నాదిర్‌షా చేతిని, తన చేతిలోకి తీసుకుని ప్రేమగా ముద్దుపెట్టుకుంది. సెలయేటి స్పర్శతో మేరుపర్వతం వణికినట్లయింది నాదిర్‌కు. ఇద్దరికీ అదొక మహత్తర మధుర క్షణం. సెలయేరు, సాగరంలో కలిసిపోయినంత తాదాత్మ్యం కలిగిన ఘడియ అది. వెంటనే నాదిర్‌షా నౌకరుచేత ముల్లాను పిలిపించి సితారాను పెళ్ళిచేసుకున్నాడు. వీరిద్దరి ప్రేమను చూసి దేవుడికి కన్ను కుట్టినట్టయిందేమో!

ఒకరు సుఖపడిపోతూ ఉంటే చూసి మరొకరికి ఈర్ష్య కలగటం మానవ నైజం. సితారా పొందిన ఈ అదృష్టాన్ని చూసి శీరాజీ ఓర్వలేకపోయింది. ప్రతీకార జ్వాలల్తో ఆవిడ హృదయం లావాలా ఎగిసి, రక్తపు మంటల్లా ఎగిసి పడింది. శీరాజీ నాదిర్‌షా మంత్రి కూతురు. నాదిర్‌షాను పొందాలని విఫలమైంది. రహస్యంగా సీతారాను సర్వనాశనం చేయటానికి శీరాజీ కుట్ర పన్నింది.

సితారాను వెంటబెట్టుకుని, నాదిర్‌షా తన సైన్యంతో ఢిల్లీ చేరుకున్నాడు. ఒకరోజు ఉన్నట్టుండి ఆదమరచి నిదురోతున్న నాదిర్‌షా సైన్యం మీద మొగల్ సైనికులు దండయాత్ర చేసి చాలామంది నాదిర్ సైనికులను వధించారు. కోపోద్రిక్తుడైన నాదిర్‌షా "ఢిల్లీనంతా గుల్లచేయండ"ని తన సైన్యాన్ని ఆదేశించాడు. ఇంకేముంది ఎటుచూసినా ఢిల్లీలో హాహాకారాలు చెలరేగాయి. అపార ధనరాశితో పాటు కోహినూర్ వజ్రం కూడా నాదిర్‌షా వశమైంది.

ఢిల్లీ మహారాణి ఈ రక్తపాతాన్ని ఎలాగైనా ఆపమని సితారాను అర్థించగా, సితారా ఎలాగో నాదిర్‌కు నచ్చజెప్పి శాంతపరిచింది. నాదిర్ అక్కడ నుండి ఫారసీవైపు తరలాడు. తన భర్త విజయానికి చాలా గర్వపడింది సితారా. మార్గమధ్యంలో ప్రయాణం ఆగింది. గుడారాలు వేశారు. గూఢచారుల ద్వారా, తన భర్తకు ప్రాణాపాయం వుందని తెలిసిన సితారా నాదిర్‌షాను కంటికి రెప్పలా కాపాడుకోసాగింది. అతను గాఢ నిద్రలో వున్నప్పుడు హత్యా ప్రయత్నం జరిగింది. కానీ సితారా అప్పుడు తన తెలివితేటల్ని ప్రదర్శించి నాదిర్‌షాను ఎలాగో బ్రతికించుకుంది.

రాజధాని చేరుకున్న నాదిర్‌షాకు ఘనమైన స్వాగతం లభించింది. తన కుమారుడైన రోజ్ ఖాన్ స్వాగతం పలికాడు. అతన్ని చూసిన సితారా తనకు సంతానం లేదన్న కొరత తీరిపోయిందనుకుంది. నాదిర్‌షా వచ్చిన కొద్దికాలానికే నాదిర్‌కు గూఢచారుల ద్వారా ఓ తలనెప్పి వార్త అందింది. తండ్రిని చంపి తనే చక్రవర్తి కావాలనుకుంటున్న రోజ్‌ఖాన్ శీరాజీతో చేతులు కలిపి కుట్ర పన్నుతున్నట్టుగా గూఢచారులు చెప్పారు. కానీ శీరాజీ నాదిర్‌కు చాడీలు చెప్పి అతని మనసు విషపూరితం చేయసాగింది. కుమారుడైన రోజ్‌ఖాన్‌కు, సితారాకు అక్రమ సంబంధాలున్నాయని చెప్పసాగింది. నాదిర్ మతి స్థిమితం తప్పాడు. కుమారుడిని చంపలేక, అతని రెండు కళ్ళను తీసేయండని ఆదేశించాడు. రోజ్ ఖాన్ సితార కాళ్ళు పట్టుకున్నాడు. ఈ పెనుగులాటలో నాదిర్‌షా సితారాను గాయపరిచాడు. సితారా కత్తిపోటుకు గురై కిందికి వాలిపోయింది.




ఆవేశంతో చేసిన ఆ పనికి నాదిర్‌షా పిచ్చివాడిలా రోదిస్తూ ఎటో వెళ్ళిపోయాడు. సితారాను రహస్య స్థావరానికి చేర్చబడింది. చనిపోయిందన్న సితారా బ్రతికింది. నాదిర్‌షా పిచ్చివాడయ్యాడన్న సంగతి సితారాకు తెలియదు. సితారా ఒక అజ్ఞాత గ్రామంలో రోజులు గడపసాగింది. నాదిర్‌షా లేకుండా తన జీవితం వ్యర్థమని భావించిన సితారా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది.

మనశ్శాంతి కోసం వేటకు వెళ్ళిన నాదిర్‌షా ఒక గ్రామం దగ్గర గుడారం వేయించాడు. ఆ గ్రామంలోనే సితారా అజ్ఞాతవాసం చేస్తున్న విషయం నాదిర్‌షాకు తెలియదు. ఇరుగు పొరుగువారు అనుకుంటూ వుంటే విన్న సితారాకు వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టనిపించింది. సితారా మానసిక స్థితిని వర్ణించటం ఇక్కడ సాధ్యం కాదు. పొంగిన నదిలా సితారా తన భర్తను కలుసుకోటానికి పిచ్చిదానిలా పరుగెత్తింది.

దూరం నుండే సిపాయిలు సితారా రాకను గమనించి, నాదిర్‌షాకు ఈ వార్తను అందించారు. నాదిర్ దిగ్గున లేచి బయటికి పరుగెత్తాడు. పమిటచెరుగు గాలిలో ఎగిరిపోయినా, పట్టించుకోని సితారా నాదిర్‌షా గుడారం వైపు దూసుకొచ్చింది. తల వెంట్రుకలు చెదిరిన సితారా పిచ్చిదానిలా అగుపించింది నాదిర్‌షాకు. ఇద్దరి కళ్ళూ చెమర్చాయి. సితారాను తన ఒడిలోకి తీసుకున్నాడు నాదిర్. ఎక్కిళ్ళతో ఆయాసంతో చిక్కిపోయిన సితారాను గాఢంగా కౌగిలించుకున్నాడు నాదిర్‌షా.

ఒక రోజు ఆదమరచి నిదురోతున్న నాదిర్‌ను బలంగా కత్తితో పొడిచి ఎవరో తెలివిగా తప్పించుకున్నారు. దురదృష్టవశాత్తు ఆ సమయంలో సితారా దగ్గరగా లేదు. చివరిసారిగా నాదిర్‌షా "సితారా..!" అని అరచిన పిలుపు నింగిలిలో ప్రతిధ్వనించింది. ఈ పర్యాయం సితారా తన ఏకైక ప్రియుడిని రక్షించుకోలేకపోయింది. పరుగెత్తికెళ్ళి చూసిన సితారాకు నాదిర్ నెత్తురుమడుగులో నిర్జీవంగా అగుపించాడు. అతడి కళ్ళు తెరుచుకునే వున్నాయి, సితారాను చూట్టానికే కాబోలు! నోరు తెరుచుకునే వుంది, సితారాతో తన చివరిమాట చెప్పటానికే కాబోలు...! పిచ్చెక్కిన సితారా కత్తి తీసి గుండెలో దింపుకుంది. ఇద్దరి ఆత్మలు గాలిలో కలిసిపోయాయి. ✵